పత్రికాప్రకటన కాకినాడ, 23.8.2018

ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ధైర్యసాహసాలు, సేవా నిరతి నేటి తరానికి ఆదర్శనీయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు.

గురువారం ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాంశం పంతులు జయంతి పురస్కరించి జిల్లా స్థాయి వేడుకలను స్థానిక జిల్లా పరిషత్ కూడలి లోని వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప ముఖ్య అతిధిగాను, శాసన మండలి సభ్యులు చిక్కాల రామచంద్రరావు, కాకినాడ రూరల్ శాసన సభ్యులు పిల్లి అనంత లక్ష్మి సత్యన్నారాయణ మూర్తి, జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా, జిల్లా ఎస్పి విశాల్ గున్నీ విశిష్ట అతిధులుగా హాజరై టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూల మాలలు అలంకరించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ఉపముఖ్య మంత్రి చినరాజప్ప మాట్లాడుతూ ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వ్యక్తి కాదని, మహా శక్తి అని కొనియాడారు. నిరుపేద కుటుంబంలో పుట్టి తన స్వయం కృషి, ప్రతిభతో మద్రాసు, ప్రత్యేకాంధ్ర రాష్ట్రాలకు ముఖ్యమంత్రిగా ఎదిగిన ప్రకాశం జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి నిస్తుందన్నారు. ఆయన రాజమండ్రిలో న్యాయవాద వృత్తి నిర్వహించడంతో బాటు, తన 35వ ఏటనే రాజమండ్రి పురపాలక సంఘానికి అధ్యక్షులుగా ఎన్నికై ప్రజలకు సేవలు అందించారన్నారు. లక్షలు ఆర్జించే వృత్తిని తృణప్రాయంగా వదిలి స్వాతంత్ర్య సమరంలో పోరాటాలు సాగించిన నిస్వార్థ దేశభక్తుడని కొనియాడారు. సైమన్ కమీషన్ బహిష్కరణ ఉద్యమంలో బ్రిటిష్ పాలకుల తుపాకులకు తమ ఛాతీ ఎదురు నిలిపి కాల్చమని సవాలు చేసిన ఆయన తెగింపు, ధైర్యసాహసాలకు తెలుగు జాతి ఉత్తేజంతో పులకరించి ఆంధ్ర కేసరి బిరుదుతో ఆయనకు జేజేలు పలికిందన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని ప్రకాశం పంతులు మూడేళ్లు జైలు శిక్ష అనుభవించారని తెలిపారు. 1937లో రాజాజీ మంత్రి వర్గంలో రెవెన్యూ మంత్రిగాను, 1946లో మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగాను పదవులు నిర్వహించిన ప్రకాశం పంతులు 1953 అక్టోబరు 1వ తేదీన ప్రత్యేకాంధ్ర రాష్ట్రం ఏర్పడినపుడు తొలి ముఖ్యమంత్రిగా నియమితులై రాష్ట్రాభివృద్ధికి పటిష్టమైన పునాదులు వేసారని కొనియాడారు. ఆయన చేసిన సేవలకు కృతజ్ఞతగా ఆయన జన్మించిన ఒంగోలు జిల్లాను ప్రకాశం జిల్లాగా నామకరణం చేయడం జరిగిందని, తెలుగు జాతి చరిత్రలో ప్రకాశం పంతులు కీర్తి చిరస్థాయిగా ఎప్పటికీ నిలిచి ఉంటుందని ఉపముఖ్యమంత్రి చినరాజప్ప శ్లాఘించారు.

ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ నందని సలారియా, ఇన్‌చార్జి డిఆర్ఓ యం.జ్యోతి, కాకినాడ ఆర్‌డిఓ ఎల్.రఘుబాబు, జడ్‌పి సిఈఓ విద్యాసాగర్, హౌసింగ్ పిడి జి.వి.ప్రసాద్, కాకినాడ అడిషనల్ కమీషనర్ నాగవేణి, డియంహెచ్ఓ రమేష్‌కిషోర్, పశుసంవర్థక శాఖ జేడి నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ డిడి రామారావు, సమాచార శాఖ డిడి యం.ఫ్రాన్సిస్, నగర ప్రముఖులు పిల్లి సత్యన్నారాయణ మూర్తి, నున్నదొరబాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

(సమాచార శాఖచే జారీ)